మోడల్ పేపర్స్‌తో విద్యార్థులకు ప్రయోజనం

విశాలాంధ్ర -కవిటి: పదవ తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్స్‌తో మరింత ఉపయోగం కలుగుతుందని బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.రామకృష్ణ అన్నారు. గురువారం విశాఖ జుత్తు జగ్గన్న మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వారు జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని మంచి గ్రేడ్లు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలాసలో మినీ ఎయిర్‌పోర్టుకు స్థల పరిశీలన

విశాలాంధ్ర- మందస/ వజ్రపుకొత్తూరు: పలాస నియోజకవర్గం పరిధిలో మినీ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఇటీవల రెవిన్యూ అధికారులు ప్రభుత్వ స్థలం పరిశీలన చేసిన విషయం తెలిసిందే. గురువారం ఎయిర్‌పోర్టు అధికారులు వజ్రపుకొత్తూరు మండలం మెట్టూరు పంచాయతీ ఒంకులూరు గ్రామ స్థలాలు, మందస మండలం బిడిమి, బేతాళపురం గ్రామాల్లో సుమారు 1383 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు.

స్థానిక రెవిన్యూ అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం ఈ స్థలాన్ని ఎయిర్‌పోర్టు అధికారులు పరిశీలించారని పలాస ఆర్డీవో జి.వెంకటేశ్వరావు తెలిపారు. ఈ పరిశీలనలో మందస, వజ్రపుకొత్తూరు తహశీలార్లు హైమావతి, సీతారామయ్య, మందస, వజ్రపుకొత్తూరు డి.టీలు రామకృష్ణ, మురళీకృష్ణ, సర్వేర్లు కొండపల్లి తిరుపతిరావు, షన్ముఖరావు, జోగారావు, మందస ఆర్.ఐ చిన్నారావు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ రెవెన్యూ సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- వాటర్ ట్యాక్స్ వసూలు చేయాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం: పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తహశీల్దార్లను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో ఆయన గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలసి సమావేశం నిర్వహించి మాట్లాడారు. రెవెన్యూ సమస్యలు, ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికకు వచ్చే అర్జీలలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, లోకాయుక్త, కోర్టు కేసులు, వాటర్ ట్యాక్స్, నాలా, రీ సర్వే, ఆర్ ఓ ఆర్, సివిల్ సప్లయ్స్, తదితర అంశాలపై ఆయన మండలాల వారీగా సమీక్షించారు. వాటర్ ట్యాక్స్ అంతా పరిశీలించి ట్యాక్స్ వసూలు చేయాలని ఆదేశించారు. ట్యాక్స్ వసూలు చేసేందుకు సిబ్బంది అవసరం ఉంటే తెలియజేస్తే డిజిటల్ అసిస్టెంట్‌ను ఇస్తామన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. ఉచిత ఇసుకపై సమస్యలు ఉంటే తక్షణమే ఆపాలన్నారు. ఎక్కడపడితే అక్కడ ఇసుక తీయడానికి అవకాశం లేదని విఆర్‌ఓకు తెలియజేయాలని, వాటర్ సోర్సెస్ దగ్గర, వంతెనలు వద్ద రాత్రి పూట తీయకూడదన్నారు. ఎన్.జి.టి. నిబంధనలు అతిక్రమించకూడదన్నారు. సీజ్ చేసిన ఇసుక ఎక్కడైనా ఉంటే తెలపాలని కలెక్టర్ చెప్పగా గార, ఆమదాలవలస, సరుబుజ్జిలి మండలాల్లో ఉన్నట్లు తహశీల్దార్లు తెలిపారు. మరమ్మతులు ఉన్న తహశీల్దార్ కార్యాలయాలు అంచనా వ్యయం పంపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం ఆర్డీఓ కె.సాయి ప్రత్యూష, ఉప కలెక్టర్లు పద్మావతి, లక్ష్మణమూర్తి, జడ్పీ సీఈవో ఎల్ఎన్‌వి శ్రీధర్ రాజు, సర్వే అండ్ లాండ్ రికార్డులు శాఖ సహాయ సంచాలకులు విజయ్ కుమార్, కలెక్టరేట్ ఆయా విభాగాల పర్యవేక్షకులు సరోజని, సూర్యనారాయణ, రాజేశ్వరరావు, శ్రీనివాసరావు, చక్రవర్తి, తహసీల్దార్లు, డిటిలు పాల్గొన్నారు.

సిక్కోలు విద్యార్థినీలకు 'ఉమెన్ ఇన్ ఏవియేషన్' పురస్కారాలు

- ఢిల్లీలో అందజేసిన కేంద్ర పౌర విమానయాన శాఖ కార్యదర్శి ఉమ్లున్మాంగ్ ఉల్నామ్
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రత్యేక అభినందనలు

విశాలాంధ్ర - శ్రీకాకుళం: జిల్లాకు చెందిన ఆరుగురు విద్యార్థినీలు జాతీయ స్థాయిలో సత్తా చాటారు. విమానయాన రంగంలో మహిళలను ప్రోత్సాహించాలనే లక్ష్యంతో శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 18న నిర్వహించిన ఉమెన్ ఇన్ ఏవియేషన్ ఇండియా వ్యాసరచన పోటీలో పాల్గొని, తమ ప్రతిభను నిరూపించుకున్నారు. దాదాపు వివిధ డిగ్రీ కళాశాలలకు చెందిన 150 మంది విద్యార్థినులు హాజరు కాగా, తుది దశకు ఆరుగురిని ఎంపిక చేశారు. వీరంతా ఈనెల 20న రాత్రి శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం చేరుకొని, అక్కడి నుంచి విమానంలో ఢిల్లీకి చేరుకున్నారు. అక్కడి ఏరో సిటీలో గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వీరందరికీ కేంద్ర పౌర విమానయాన శాఖ కార్యదర్శి ఉమ్లున్మాంగ్ ఉల్నామ్, ఉమెన్ ఇన్ ఏవియేషన్ ఇండియా అధ్యక్షురాలు రాధా భాటియా, ఏవియేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ విపిన్ కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా విమానయాన శాఖ కార్యదర్శి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 30 మంది విద్యార్థినులు విజేతలుగా నిలవగా.. కేవలం శ్రీకాకుళం జిల్లాకు చెందిన వారే ఆరుగురు ఉండటం అభినందనీయమన్నారు. విమానయాన రంగంలో మహిళలను మరింతగా ప్రోత్సాహించాలనే కేంద్ర మంత్రి, శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆకాంక్షలకు ఇదే నిదర్శనమన్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన విద్యార్థినులు జాతీయ స్థాయిలో ప్రతిభ చూపడంపై పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వీడియో సందేశం విడుదల చేశారు. బహుమతులు పొందిన విద్యార్థినులకు అభినందనలు తెలియజేశారు. ఉన్నతంగా రాణించాలనే బాలికల కలలకు రెక్కలిద్దామని పిలుపునిచ్చారు. ఢిల్లీ పర్యటనకు ఎంపికైన విద్యార్థులు 3 రోజుల పాటు దేశ రాజధానిలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించనున్నారు. తిరిగి ఈనెల 23న సాయంత్రం 6.25 గంటలకు ఢిల్లీలో బయలుదేరి, 20.40 గంటలకు విశాఖపట్నం చేరుకోనున్నారు. విద్యార్థినులను ఆయా కళాశాలకు చెందిన ప్రిన్సిపాళ్లు అభినందించారు.

ఉన్నత పాఠశాలల పనివేళ మార్పు విరమించుకోవాలి

- ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎస్.వి.రమణ మూర్తి

విశాలాంధ్ర - ఆమదాలవలస: ఉన్నత పాఠశాలల పని వేళల మార్పును విరమించుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎస్.వి.రమణ మూర్తి డిమాండ్ చేశారు. సమస్యల సేకరణ, సభ్యత్వ నమోదు ప్రక్రియలో భాగంగా సరుబుజ్జిలి మండలంలో పురుషోత్తపురం, కొత్తకోట, సరుబుజ్జిలి, కాగితాపల్లి పాఠశాలలను గురువారం ఆయన సందర్శించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఉదయం 9 గంటలు నుండి సాయంత్రం 4 గంటల వరకూ మాత్రమే ఉండాలని అలా కాకుండా ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటలవరకూ పని వేళలు పెంచాలని కసరత్తు చేయడం తగదన్నారు. పని వేళలు మార్చాలంటే విద్యార్థుల మానసిక స్థితి, విద్యార్థి అభ్యసన సంసిద్ధత, రవాణా సౌకర్యం, విద్యార్థినుల భద్రత తదితర అంశాలు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలో కూడా సాయంత్రం 4.15 గంటలు దాటి పాఠశాలలు పని వేళలు లేవని స్పష్టం చేశారు. సంవత్సరాల తరబడి పరిష్కారానికి నోచుకోని ఏకీకృత సర్వీసు నిబంధనలు, పురపాలక పాఠశాలల సమస్యలు, సిపియస్ రద్దు తదితరాలపై దృష్టిసారించిన దాఖలాలు లేవన్నారు. ఇప్పటికైనా ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై దృష్టిసారించి రావలిసిన బకాయిలు, ఐఆర్, పిఆర్సిపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రమణ, మండల నాయుకులు పేడాడ అన్నజీ బాబు, అన్నెపు గోవి, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాతపట్నం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయండి

- సీఎం చంద్రబాబును కోరిన ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

విశాలాంధ్ర - జలుమూరు/హిరమండలం: జిల్లాలో బాగా వెనుకబడి పోయిన పాతపట్నం నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. నియోజకవర్గంలో మెలియాపుట్టి, పాతపట్నం, హిరమండలం, కొత్తూరు, ఎల్ఎన్ పేట, మెలియాపుట్టి మండలాలు ఉన్నాయని ఇవి బాగా వెనుకబడి ఉన్నాయని తెలియజేశారు. అన్ని నియోజక వర్గాల్లో 50 శాతం షెడ్యూల్ తెగల కులాల వారే ఉన్నారని ఆయన వివరించారు. ఇటువంటి వెనుకబడిన ఈ నియోజకవర్గంలో ప్రధాన సమస్యలైన అగ్నిమాపక కేంద్రం, ఐటీడీఏ ఏర్పాటు, నిత్యావసర సరుకుల గిడ్డంగి ఏర్పాటు అనేక సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లారు.

సిక్కోలు జానపద కళా జాతరకు కిక్కర విరాళం

విశాలాంధ్ర, - పలాస: 2025 జనవరి 12న జరగబోయే సిక్కోలు జానపద కళా జాతర కార్యక్రమానికి తొలి విరాళం 5555 రూపాయలను గురువారం బొడ్డపాడు గ్రామ దేవత చింతల పోలమ్మ గుడి ఆవరణలో కళాకారుడు జెస్సీ ఈవెంట్ ఆర్గనైజర్ కిక్కర ఢిల్లీరావు అందజేశారు. మందస మండలం చిన్న బహాడపల్లి గ్రామంలో 2021లో జరిగిన సిక్కోలు జానపద కళా జాతరకు కూడా కిక్కర ఢిల్లీరావు తొలి విరాళం అందజేశారని పలువురు కొనియాడారు. అదే ఆనవాయితీతో ఢిల్లీరావు వద్ద తొలి విరాళం తీసుకుని 2025లో జరగనున్న సిక్కోలు జానపద కళా జాతర అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

పీఎస్‌ను సందర్శించిన ఎస్పీ

విశాలాంధ్ర - హిరమండలం: హిరమండలం పోలీస్ స్టేషన్‌ను జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కెవి మహేశ్వరరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించి పరిసరాల పరిశుభ్రతలో భాగంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసులపై ఆరా తీశారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కొత్తూరు సీఐ చింతాడ ప్రసాద్, స్థానిక ఎస్సై మహమ్మద్ యాసిన్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం: ఇటీవల కాలంలో ఆర్థిక నేరాలు పెరుగుతున్నాయని, సైబర్ మోసాలతో ధన మాన నష్టాలు కల్గుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎం.చిన్నంనాయుడు అన్నారు. రూరల్ ఎస్సై శ్రీనివాస్‌తో కలిసి హరిపురం గ్రామంలో 'సంకల్పం' కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతు మహిళలు, విద్యార్థినులు అపరిచిత వ్యక్తులతో పరిచయాలకు దూరంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, వాట్సాప్ ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే సందేశాలు, కాల్స్‌కు స్పందించకుండా ఉండటం మేలని అన్నారు. రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా వాహనాలు నడిపేటప్పుడు , రోడ్డు పై నడిచేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

కూటమి ప్రభుత్వంతోనే రజకుల అభివృద్ధి

ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

విశాలాంధ్ర - రణస్థలం: కూటమి ప్రభుత్వంతోనే రజకుల అభివృద్ధి సాధ్యమౌతుందని విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో తన నివాసంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన గురజాపు రాము ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు కృతజ్ఞతలు తెలుపుతూ దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రజకుల అబివృద్ధికి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో రజక సాధికారక కమిటీ ఎచ్చెర్ల నియోజకవర్గ సభ్యులు ధర్మవరపు శంకరరావు, సోపేటి రామారావు, జొన్నాడ భాస్కరరావు, దరమసింగి మహాలక్ష్మినాయుడు, ప్రసాద్, కేశవరావు, నారాయణరావు, పాపారావు, రమణ తదితరులు ఉన్నారు.

ఆర్డీవోని కలిసిన యడ్ల గోపి

విశాలాంధ్ర - టెక్కలి: ఇటీవలే టెక్కలి డివిజన్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఎం.కృష్ణమూర్తిని గురువారం దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల గోపి మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ దళితులు పడుతున్న సమస్యల గురించి వివరించారు. అలాగే మండల కేంద్రంలో ఉన్న కొన్ని గ్రామాలలో శ్మశాన వాటికులకు రహదారులు లేక అనేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. దళితులు పడుతున్న సమస్యలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కోరారు.

సముద్ర తాబేళ్ల సంరక్షణపై అవగాహన

విశాలాంధ్ర-సోంపేట: సోంపేట మండలం బారువ కొత్తూరు గ్రామంలో గురువారం ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సముద్ర తాబేళ్ల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బారువ సెక్షన్ ఆఫీసర్ రామకృష్ణ, కపాసుకుద్ది సెక్షన్ ఆఫీసర్ రాఘవయ్య, రవికుమార్, తదితరులు మత్స్యకారులకు అవగాహన కల్పించారు. మత్స్యకారుల వలలకు చిక్కిన సముద్రపు తాబేళ్లను రిలీజ్ చేసే విధానం, వాటిని సంరక్షించి సముద్రంలో విడిచిపెట్టే విధానాలను గూర్చి వివరించారు.

నిరుపేదలకు నిత్యావసర వస్తువుల పంపిణీ

విశాలాంధ్ర - టెక్కలి: అభాగ్యులకు చేయూతనివ్వడానికి స్థాపించబడిన అభయం యువజన సేవా సంఘం సభ్యులు గురువారం మార్నింగ్ వాక్ ఫర్ పూర్ పీపుల్ కార్యక్రమం ద్వారా టెక్కలి మండలం గోపినాథపురంలో కిడ్నీ బాధితుడు పతంగి సూర్యారావుకి, బ్రాహ్మణ వీధిలో కేన్సర్ బాధితుడు షేక్ ఇమామ్‌కి, సర్వమంగళ వీధిలో ఆసరా లేని వృద్ధురాలు పూతిక రాజేశ్వరికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమఇంలో అభయం యువజన సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు, సెక్రటరీ లాడే కామేశ్వరరావు, ట్రెజరర్ శ్రీనివాస్ బెహరా, సంఘ సభ్యులు యన్.సింహాచలం, ధర్మవరపు పూర్ణాచారి, అద్దాల వీరభద్రాచారి, మున్నా తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ సమస్యలపై దృష్టిసారించాలి

- శాసనమండలి సభ్యులు నర్తు రామారావు

విశాలాంధ్ర-కవిటి: నియోజకవర్గంలోని మరణ మృదంగం మోగిస్తున్న కిడ్నీ సమస్యలపై స్థానిక సంస్థల శాసనమండలి సభ్యులు నర్తు రామారావు గురువారం కౌన్సిల్లో మాట్లాడారు. గత ప్రభుత్వం కిడ్నీ రోగుల కోసం చేసిన సేవలను తెలుపుతూ కొనసాగింపుగా ప్రస్తుత ప్రభుత్వం ఏమి చేస్తుందో వివరణ అడుగుతూ.. డయాలసిస్ కేంద్రాల సంఖ్యను పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. "శ్రీకాకుళం జిల్లాలోని కిడ్నీ వ్యాధులు ప్రపంచం దృష్టిని ఆకర్షించాయని, ఈ కిడ్నీ వ్యాధులపై మొదటిగా మా నాయకుడు జగన్మోహన్ రెడ్డి ఇచ్చాపురం నియోజకవర్గం కవిటి మండలం జగతి గ్రామానికి తీసుకువచ్చి సమావేశం ఏర్పాటు చేశాను అధ్యక్షా..!! ఆ కిడ్నీ బాధితులకు ఆరోజు జగనన్న ఇచ్చిన మాట ప్రకారం,పదివేల రూపాయల పింఛను అధికారంలోకి రాగానే ఇచ్చారు అధ్యక్షా.. తాగునీరు సమస్య వల్ల కిడ్నీ వ్యాధులు వ్యాపిస్తున్నాయని పరిశీలనలు చేసిన వైద్యులు చెబితే, దీనికోసం 700 కోట్ల రూపాయలు ఖర్చు చేసి హిరమండలం నుంచి మా ఇచ్చాపురం వర్గానికి తాగునీరు తీసుకొచ్చామని తెలిపారు. దీంతో పాటు పలాస నియోజకవర్గంలో 74 కోట్ల రూపాయలతో 200 బెడ్లతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ మా ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేశారని అన్నారు. ప్రస్తుతం ఒక్కో డయాలసిస్ సెంటర్లో, ఒక బెడ్ మీద ఒక రోగికి బదులు ముగ్గురు రోగులు ఉంటున్న పరిస్థితి ఉందని ఆయన ప్రస్తావించారు.

ఎమ్మెల్యే గారూ...అబద్ధాలు మానండి

విశాలాంధ్ర - పోలాకి: అసెంబ్లీ సాక్షిగా నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అబద్దాలు చెప్పడం మానుకోవాలని ప్రజలు ఎవరు నమ్మరని వైసీపీ నాయకులు, మాజీ డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు ఆరోపించారు. గురువారం పోలాకిలో ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ నరసన్నపేట గవర్నమెంట్ హాస్పిటల్ అభివృద్ధికి మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాసు ఎంతగానో కృషి చేశారని, వంద పడకల హాస్పిటల్ కృషి చేసింది కృష్ణదాస్ కాదా అని ప్రశ్నించారు. అప్పట్లో నలుగురు డాక్టర్లతో నడుపుతున్న హాస్పిటల్ 21 మంది డాక్టర్లుగా తీర్చిదిద్దిన సంగతి మర్చి పోవద్దని హితవు పలికారు. టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అంటూ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు ఏమైపోయాయని ప్రశ్నించారు. కార్యక్ర మంలో ఎంపీపీ ప్రతినిధి ముద్దాడ బైరగినాయుడు, మండల నాయకులు కనితి కృష్ణారావు, ఎంపీటీసీ ప్రతినిధి తూలుగు అశోక్, ఐ పాస్టర్ యువజన నాయకులు ఆర్.త్రినాధరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో నూతనోత్తేజం

- ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల: టీడీపీలో సభ్యత్వం తీసుకోవడంతో నూతనోత్తేజం వెల్లివిరిస్తుందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. మండలం చిలకపాలెం గ్రామంలో గురువారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్లు పార్టీకి కష్టపడే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటున్నారని చెప్పారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంతో పార్టీ శ్రేణుల్లో ఆత్మ విశ్వాసం పెంపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంతో పార్టీకి మరింత బలం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, పార్టీ నేతలు గాలి వెంకటరెడ్డి, అన్నెపు భువనేశ్వరరావు, బల్లాడ అరుణ, చిలక రాము, మెండ రాజారావు, మూకళ్ల భాస్కరరావు, చిలక శేఖర్, లచ్చుబోతు అప్పలరాజు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

విశాలాంధ్ర-కవిటి: మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి,కాలింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్ అన్నారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని లోళ్ల నారాయణమూర్తి కళ్యాణ మండపం లో మత్స్యకార దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వేటకి వెళ్లే పలువురు మత్స్యకారులకు జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, కాలింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్ చేతుల మీదిగా దుస్సాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నియంత్రణకు పటిష్ట చర్యలు

- జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: శ్రీకాకుళం జిల్లాను మత్తు, మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణతో జిల్లా పోలీసు శాఖ పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి గురువారం ఓ పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు ఉత్పాదకాలను పూర్తి స్థాయిలో నియంత్రించేందుకు ఎన్ఫోర్స్మెంట్ చర్యలో భాగంగా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లా సరిహద్దుగా ఇచ్చాపురం పురుషోత్తపురం, పాతపట్నం, పైడి భీమవరం సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక చెక్ పోస్టులను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. గంజాయి మూలాలను కనిపెట్టేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ బృందాలు జిల్లాలో గంజాయి వినియోగం, క్రయ విక్రయాలు, అక్రమ రవాణా నిల్వలను గుర్తించేందుకు నిఘా ఉంచి నిరంతరం పర్యవేక్షిస్తుంటారన్నారు. జిల్లాలో గంజాయిని పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవడం జరుగుతుందని గంజాయి వినియోగం, సేవించడం, క్రయ విక్రయాలు, అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

శిల్పి తిరుపతికి సత్కారం

విశాలాంధ్ర - కవిటి: మండలంలోని బొరివంక గ్రామానికి చెందిన ఉద్దానం యూత్ క్లబ్ సభ్యులు బైరి తిరుపతిని సోంపేటకు చెందిన ప్రముఖ వైద్యులు శ్రీశయన సంఘ పెద్దలు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ వెంకటేష్ గురువారం ఘనంగా సత్కరించారు. మండలంలోని తుంగాన పుట్టుగ గ్రామంలో శిల్పి తిరుపతి నిర్మించిన అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా శిల్పి బైరి తిరుపతి తోపాటు ఆయన మాతృమూర్తి నీలమ్మలకు శాలువాలతో ఘనంగా సత్కరించి మెమొంటోలను అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ తిరుపతి శిల్పకళలో ఎంతో ప్రాముఖ్యత కనబరుస్తూ అందమైన దేవాలయాలతో పాటు దేవతామూర్తుల విగ్రహాలను తయారు చేయడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా శ్రీశయన సంఘ అధ్యక్షులు దీనబంధు, సంఘ సభ్యులు తాతయ్య, కృష్ణ, నారాయణ, ఇంద్రరావు, దశరాజు, గ్రామస్తులు, ఆలయ ప్రతిష్ఠ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

స్థాపితం : 1952
విశాలాంధ్ర
తెలుగు జాతీయ దినపత్రిక
విలేకరులు కావలెను
విశాలాంధ్ర దినపత్రికకు శ్రీకాకుళం జిల్లాలో ఈ కింది తెలపబడిన మండలాలకు విలేకరులు కావలెను. విశాలాంధ్రలో జర్నలిస్టుగా పనిచేయాలన్న ఆసక్తి గల వారికి అవకాశం కల్పించబడును.
కావాల్సిన ప్రాంతాలు :
సంప్రదించవలసిన నెం :
సనపల రమేష్, జిల్లా బ్యూరో చీఫ్
7569642555

జాతీయ లోక్ అదాలత్‌ని వినియోగించుకోండి

విశాలాంధ్ర-టెక్కలి : డిసెంబర్ 14వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్ ను వినియోగించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి టెక్కలి ఎస్.హెచ్.ఆర్ తేజ చక్రవర్తి కోరారు. ఈ సందర్భంగా కోటవర్ణంలో గురువారం న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజీకి అనుకూలమైన వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు న్యాయవాదులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో న్యాయ వాదుల సంఘం అధ్యక్షులు డి.వి. వివేకానంద, ఏజీపి.జి. కృష్ణారావు, ఏపిపి.పి. రమేశ్, ఇతర న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ఫాసిజాన్ని అడ్డుకోవడమే తక్షణ కర్తవ్యం

న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మాధవరావు

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : దేశం ఫాసిస్ట్ ప్రమాదాన్ని ఎదుర్కొంటుందని ఫాసిజాన్ని అడ్డుకోవడమే తక్షణ కర్తవ్యమని సిపిఐ.ఎంఎల్. న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు పిలుపునిచ్చారు గురువారం వజ్రపుకొత్తూరు మండలం మర్రిపాడులో శ్రీకాకుళ అమరుల 46వ స్మారక సభను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ మూడోసారి అధికారంలోకి వచ్చాక దేశానికి ఫాసిస్ట్ ప్రమాదం పొంచి ఉందన్నారు. మతోన్మాదాన్ని విద్వేషాలను రెచ్చగొట్టడం సంఘ పరివార్ అజెండాను యథావిధిగా మోడీ అమలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘ పరివార్ మూకలతో నానాటికి మరింతగా ప్రమాదం పెరిగిందని, కార్పొరేట్ల బ్రాహ్మణ భూస్వామ్య విలువలు విస్తరిస్తున్నారని మండిపడ్డారు. ముస్లింలను క్రైస్తవులను కమ్యూనిస్టులను అంతర్గత శత్రువులుగా చూడడం వారిని అంతం చేయడం అణచివేయడమే వీరు లక్ష్యంగా పెట్టుకున్నారని విమర్శించారు. దక్షిణాదిలో మత విద్వేషాలు రెచ్చగొట్టడంలో భాగంగానే పవన్ కళ్యాణ్ తో తిరుపతి లడ్డు చుట్టూ రాజకీయాలు చేసే ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. మోడీ కార్పొరేటర్ల ఏజెంట్లుగా మారి సహజ వనరులన్నీ సామ్రాజ్యవాద బహుళ జాతి సంస్థలకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. భూమి కొరకు భుక్తి కొరకు ఈ దేశ విముక్తి కొరకు నక్సల్ బరి శ్రీకాకుళ ఉద్యమాలు ముందుకు వచ్చాయని ఈ ఉద్యమాల్లో ఎంతో మంది డాక్టర్లు లాయర్లు ఇంజనీర్లు ఉపాధ్యాయులు సాధారణ కార్యకర్తల దగ్గర నుండి అనన్య త్యాగాలు చేశారని వారందరికీ సిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కమిటీ తరపున విప్లవ జోహార్లు అర్పించారు. రాజ్య హింసకు పోరాడాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు అమరుడు మురిపిండి వల్లభ రావు జీవిత సహచరి మురిపిండి ఎరకమ్మ అమరుల స్తూపంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఐఎఫ్ టి యు జిల్లా కన్వీనర్ జుత్తు వీరస్వామి అధ్యక్షతన జరిగిన సభలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు మామిడి భీమారావు, పిడిఎఫ్ యు ప్రధాన కార్యదర్శి మద్దిల వినోద్, పిఓడబ్ల్యు జిల్లా అధ్యక్షులు బతకల ఈశ్వరమ్మ, అరుణోదయ జిల్లా అధ్యక్షులు సొర్ర రామారావు, సవర బంగ్లా కుమార్, మురుపింటి తాత రావు, రాపాక చంద్రయ్య పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు, క్లైమ్‌ల పరిష్కారానికి చొరవ చూపండి

- ఏపీ జి ఎల్ ఐ సంచాలకులు రెడ్డి శ్రీనివాస్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: సకాలంలో రుణాలు క్లైమ్ ల పరిష్కారానికి చొరవ చూపాలని ఏపిజిఎల్ఐ రాష్ట్ర సంచాలకులు రెడ్డి శ్రీనివాస్ అన్నారు. వారి పర్యటనలో భాగంగా గురువారం శ్రీకాకుళం చేరుకున్న సంచాలకులు శ్రీకాకుళం ఏపిజిఎల్ఐ కార్యాలయంకు చేరుకొని తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది హాజరుకు సంబంధించి ఎఫ్ ఆర్ ఎస్, హాజరు పట్టీ, ఇతర రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్త పరిచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ, ఏపీజిఎల్ఐ లో అధికారులు సిబ్బంది అందరూ కలిసిమెలిసి ఒకే కుటుంబ సభ్యులుగా ఉండాలని, ఇతర శాఖల అధికారులు, సిబ్బందికి ఏపిజిఎల్ఐ అందిస్తున్న సేవలు పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. ఏపిజిఎల్ఐ రుణాలు క్లైములు పరిష్కారంలో చొరవ చూపించాలని ఆదేశించారు. అదేవిధంగా పాలసీలకు సంబంధించి ఎవరికైనా అనుమానాలుంటే నివృత్తి చేయాలని ఆదేశించారు. ఏపీజిఎల్ఐ పాలసీ పెంచుకునే వెసులుబాటును కల్పించిన విషయాన్ని అవగాహన పరచాలన్నారు. అలాగే ఏపీ జి ఎల్ ఐ కి సంబంధించిన పాలసీ, లోన్ క్లైమ్ సేవలు ఆన్లైన్ నిధి పోర్టల్ ద్వారా అందజేయడం జరుగుతున్నదని, నామిని వివరాలు అప్డేషన్ పాలసీదారులకు అప్డేట్ చేయుటకు నిధి యాప్ లో సదుపాయం కల్పించడం అయినదని, ఇకపై ఎటువంటి ఫిజికల్ దరఖాస్తులను అంగీకరించబడవని భీమ సంచాలకులు తెలియజేశారు. అనంతరం విశాఖపట్నం జిల్లా ఎపిజిఎల్ఐ కార్యాలయం తనిఖీకి బయలుదేరి వెళ్లారు. ముందుగా శ్రీకాకుళం చేరుకున్న సంచాలకులు రెడ్డి శ్రీనివాస్ స్థానిక అరసవల్లి దేవస్థానము లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం తరపున పూర్ణకుంభంతో స్వాగతం పలికిన అర్చకులు తీర్థ ప్రసాదాలను, ఆశీర్వాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కేంద్రం సహాయ సంచాలకులు ఏ ఆర్కే నాయుడు, శ్రీకాకుళం సహాయ సంచాలకులు యస్. సతీష్ కుమార్, పర్యవేక్షకులు యస్.యం.సుభని, జి.అనురాధ, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవాలు స్ఫూర్తిదాయకంగా ఉండాలి

జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.తిరుమల చైతన్య

విశాలాంధ్ర-మందస : యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు స్ఫూర్తిదాయకంగా ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య అన్నారు. గురువారం జిల్లా స్వర్ణోత్సవ మహాసభల గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహలే లక్ష్యంగా ఉపాధ్యాయులకు, విద్యారంగానికి సేవలు అందిస్తున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ హరిపురం లో నిర్వహిస్తున్న విద్య వైజ్ఞానిక మహాసభలు ఉపాధ్యాయుల్లో చైతన్య పరచడముతో బాటు విద్యారంగ అభివృద్ధికి స్ఫూర్తి దాయకంగా ఉండాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబురావు, జిల్లా కార్యదర్శి గున్న రమేష్, రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయం, సహకార మార్కెటింగ్ శాఖామాత్యులు కింజరాపు అచ్చేన్నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖామాత్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, జిల్లా అధికారులతో పాటు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ. వెంకటేశ్వర రావులు, వివిధ సంఘాల రాష్ట్రనాయకులు హాజరవుతున్న మహాసభలకు జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున ఉపాధ్యాయుల హాజరై యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల యుటిఎఫ్ అధ్యక్షులు జగదీష్ బడిత్య, ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బి ఎస్ పురం ప్రధానోపాధ్యాయులు ఎ తులసీరావు, పీజీటీలు మార్పు చక్రధర్ రావు, గున్న రమణబాబు, యుటిఎఫ్ జిల్లా కౌన్సిలర్లు కొర్ల సోమేశ్వరరావు, కాసం శ్రీనివాసరావు, లండ రాజారావు, జన్ని సోమేశ్వరరావు, గున్నరాజు, దూగాన మాధవరావు, యుటిఎఫ్ సీనియర్ కార్యకర్తలూ మజ్జి రంగారావు, సీపాన అమ్మి నాయుడు, , గున్న చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం ద్వారా ఉన్నత శిఖరాలకు...

- గ్రంథాలయ వారోత్సవాల్లో డాక్టర్ దానేటి

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : విద్యార్థి దశ నుండే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని, పుస్తక పఠనం ద్వారా ఎంతోమంది ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని ప్రముఖ లేప్రోస్కోపిక్ వైద్య నిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. స్థానిక బలగ శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమం గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన డాక్టర్ దానేటి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానిని సాధించేందుకు క్రమశిక్షణతో కృషి చేయాలన్నారు. గ్రంథాలయానికి వచ్చిన ముగ్గురు విద్యార్థులకు పేద విద్యార్థులకు రూ.3 వేలు చొప్పున ప్రతి సంవత్సరం అందజేస్తానని డాక్టర్ శ్రీధర్ అన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిధిగా హాజరైన హర్షవల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షులు వావిలపల్లి జగన్నాథం నాయుడు మాట్లాడుతూ పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొంక్యా వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. పదవీ విరమణ చేసిన గ్రంథాలయాధికారులు మలిపెద్ది చంద్రశేఖరరావు, సింగూరు రమణమూర్తికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐడియల్ యూత్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ రొక్కం భాస్కరరావు, బాలకథానిలయం అధ్యక్షులు భోగెల ఉమామహేశ్వరరావు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అన్నెపు పున్నయ్య పాల్గొన్నారు. హిందీ ఉపాధ్యాయులు పద్మనాభ రాజు, సహాయకురాలు కె.అనిత, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కల్తీ ఆహార పదార్థాలు అమ్మితే చర్యలు తప్పవు : అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్

- ఆహార పదార్థాలు పై కరువైంది మెగా అనే వార్త కు స్పందించిన అధికారులు

విశాలాంధ్ర-జలుమూరు: విశాలాంధ్ర దినపత్రికలో ప్రచురితమైన ఆహార పదార్థాల పై కరువైనిఘా అనే వార్తను సంబంధిత అధికారులు స్పందించారు జిల్లాలో ఇద్దరు ఫుడ్డు సేఫ్టీ అధికారులు ఉన్నందున అధికారులకు తగ్గట్టు వాహనాలు లేనందున తనిఖీలు సకాలంలో చేయలేని పరిస్థితి ఉందని వారు వివరించారు ఆహార ప్రయోగశాలకు రసాయనిక పరీక్ష నిమిత్తం పంపుతున్నామని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ తెలిపారు 2024 నుండి అక్టోబర్ 2024 వరకు 156 శాంపిల్స్ తీసినట్లు ఇందులో 13 ఫుడ్ శాంపిల్స్ నాణ్యత నాణ్యత లేదని నిర్ధారించి ఫుడ్డు జర్నలిస్ట్ నివేదిక పంపినట్లు తెలిపారు అక్రమాలకు పాల్పడిన వ్యాపారస్తులపై త్వరలో చట్టపరమైన చర్యలు ఆహార భద్రత మరియు ప్రమాణాలు చట్టం 2006 క్రింద చర్యలు తీసుకుంటామని వివరించారు జిల్లాలో 70 క్రిమినల్ కేసులు మరియు జాయింట్ కలెక్టర్ వారు ఎడ్యుకేషన్ కేసులు 31 నమోదు చేసి ఉన్నారని తెలిపారు ఎటువంటి అవకతవకలు జరిగిన చర్యలు తప్పవని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీకాకుళం వారు తెలిపారు.

ఎమ్మెల్సీ నర్తు మాటలపై మండిపడ్డ వాబయోగి

విశాలాంధ్ర-జలుమూరు: శాసనమండలిలో ఎమ్మెల్సీ నర్తు రామారావు అవగాహన లేకుండా మాట్లాడడం బాధాకరమని శ్రీకాకుళం జిల్లా ఆదివాసి మనోభావాలు దెబ్బతీశాయని ఆదివాసి సంక్షేమ పరిషత రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబయోగి అన్నారు. మండల కేంద్రంలో సారవకోట విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు. జిల్లాలో ఉన్న నకిలీ బెంత్ ఒరియాలని స్వయంగా గిరిజన సంస్కృతి సాంప్రదాయాల పరిశోధన సంస్థ అధ్యయనం చేసి అప్పటి ప్రభుత్వానికి నివేదిక అందజేసిందని ఆ విధంగా దంతు ఒరియాలుగా చెప్పుకుంటున్న వారు వడ్డీ బిసి ఏ కులానికి చెందిన వారిని ప్రభుత్వమే డిక్లేర్ చేసిందని యోగి అన్నారు. సమాచారం లేకుండా అవగాహన రాహిత్యంగా శాసన మండలి నాయకులు మాట్లాడ్డం సిగ్గుచేటని బెంతు ఒరియాలపై మీకు అవగాహన కలగాలంటే విశాఖలో ఉన్నటువంటి గిరిజన సాంస్కృతి సాంప్రదాయ పరిశోధన సంస్థ కార్యాలయానికి వెళ్లి తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ సభ్యులు జన్ని దాలయ్య బొమ్మాలి కృష్ణ బాలరాజు, నాగయ్య, రంగారావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి జన్మదిన వేడుకల కోసం చల్లవానిపేటలో ఏర్పాటు

విశాలాంధ్ర-జలుమూరు : నవంబర్ 23 నభగవాన్ సత్యసాయిబాబా 99వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జలుమూరు మండలం చల్లవానిపేట సత్యసాయి భజన మండలి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది 21 వ సంవత్సర కార్యక్రమం సందర్భంగా ఉదయం 4:30 నుండి సాయంత్రం వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు భజన మండలి సభ్యులు తెలిపారు చల్లవానిపేట భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలోఉదయం 10 గంటలనుండి 150 మంది ధీనజనులకు దుప్పట్ల పంపిణీ అనంతరం స్వామి వారి దేవ వభవ విశేషాలు మంగళహారతి ఊయల ఉత్సవం ఉంటుందని వారు తెలిపారు మధ్యాహ్నం 12 గంటల నుండి మహా అన్నప్రసాద కార్యక్రమం జరుగుతుందని రాత్రి ప్రత్యేక భజన కార్యక్రమం అల్పాహార ప్రసాదం వేత్తలను జరుగుతుందని తెలిపారు భక్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎలుగు బంటులపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-మందస/వజ్రపుకొత్తూరు: ఎలుగు బంటుల సంచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వజ్రపు కొత్తూరు మండలం అటవీ శాఖకు చెందిన సెక్షన్ అధికారి బి రామకృష్ణ అన్నారు. కాశీబుగ్గ రేంజ్ అటవీ శాఖ అధికారి మురళి కృష్ణం నాయుడు ఆదేశాల మేరకు గురువారం అనకాపల్లి మరియు బిడిమి గ్రామాల్లో ఎలుగుబంటులపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలుగుబంటులకు ఎటువంటి కవ్వింపు చర్యలు చేపట్టరాదని అన్నారు.ప్రజలు ఎలుగుబంటి నుండి ఎలా రక్షించుకోవాలో గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి పంచాయతీ సర్పంచ్ పాపారావు,మాజీ సర్పంచ్ భీమారావు, ఉప సర్పంచ్ దిలీప్ మరియు అటవీ శాఖ సిబ్బంది రాఘవయ్య ఎఫ్ఎస్ఓ మరియు ఎం పోలయ్య మెట్టురు ఎఫ్బి ఓ ఆర్ సంతోష్ కుమార్ రవికుమార్ తిరుపతిరావులు పాల్గొన్నారు.

అక్రమ రవాణా, బెల్ట్ షాపులపై ప్రత్యేక నిఘా పెంచండి : ఏసీ

విశాలాంధ్ర-జలుమూరు : శ్రీకాకుళం జిల్లా ఒడిస్సా సరిహద్దులోనున్న పాతపట్నం ప్రదేశం అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధి మరికొంత సిబ్బందితో నిగా పెంచాలని ప్రొవిషన్ అండ్ ఎక్సైజ్ సహాయ సంచాలకులు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం పాతపట్నం ప్రొఫెషన్ సర్కిల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. జిల్లాలో శివారు సర్కిల్ కార్యాలయం కనుక ఒరిస్సా సరిహద్దులో ప్రత్యేకంగా వేయాలని ఆయన సర్టిల్ ఇన్స్పెక్టర్ కే శ్రీనివాస్ రావు సూచించారు. గంజాయి ఇతర మత్తుపదార్థాలు అధికంగా దిగుపతి కావచ్చని కనుక నేనిఘాపెంచాలని శ్రీకాంత్ రెడ్డి అన్నారు. కార్యాలయంలోనున్న రికార్డులను పరిశీలించారు. ఆయనతో పాటు సర్కిల్ ఇన్స్పెక్టర్ కోట శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

మన వంటగదిపై క్విజ్ పోటీ

విశాలాంధ్ర-కవిటి: మన వంట గది మన బాధ్యత పేరిట కవిటి చింతామణి భారత్ గ్యాస్ ఏజెన్సీ వారి ఆధ్వర్యంలో కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం బి. మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఎల్పీజీ గ్యాస్ వినియోగంపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. ఈ సందర్భంగా దీని క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతామణి భారత్ గ్యాస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా అసిరి పోలమ్మ ఆలయ ప్రతిష్ట మహోత్సవం

విశాలాంధ్ర-కవిటి : కవిటి మండలం తుంగానపుట్టుగ గ్రామంలో అసిరి.పోలమ్మ గ్రామ దేవత ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విగ్రహంను సముద్ర జలాలు, పంచామృతాలతో శుద్ధి చేసి అనంతరం ఆలయంలో ప్రతిష్ఠంప చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్పర్సన్ పిరియా విజయసాయిరాజు,వైకాపా నాయకులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజాలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటి సభ్యులు, యువకులు, సర్పంచ్ బద్రి ప్రకాష్, ఎంపీటీసీ పిరియా క్రిష్ణారావు, గ్రామ పెద్దలు టి.రామారావు, టి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా తయారీపై ఎక్సైజ్ దాడులు

విశాలాంధ్ర-సోంపేట: సోంపేట ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్ శాఖ పరిధిలో మందస మండలం చాపరాయి గ్రామంలో నాటుసారా స్థావరాలపై గురువారం అధికారులు దాడులు చేపట్టారు. సీఐ కె.బేబీ, ఎస్సై జాన్ ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి జరిపిన దాడుల్లో 700 లీటర్ల బెల్లపు ఊటలను ధ్వంసం చేశారు. అలాగే సవరమధ్య గ్రామంలో 800 లీటర్ల బెల్లపు ఊటలను ధ్వంసం చేశారు. 20 లీటర్ల నాటుసారాను కూడా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎన్ఫోర్స్‌మెంట్ శ్రీకాకుళం ఏఈఎస్ టాస్క్‌ఫోర్స్ పలాస, పలాస ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లక్ష్యాలను సాధించాలి

- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: ప్రణాళికాబద్ధంగా జిల్లాలో గృహ నిర్మాణ లక్ష్యాలు సాధించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గృహ నిర్మాణశాఖ అధికారులకు స్పష్టం చేశారు. గృహ నిర్మాణ శాఖకు నిర్దేశించిన లక్ష్యాలు, ప్రగతిపై కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పలు సూచనలు చేశారు. ప్రభుత్వం గృహ నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందుకు అనుగుణంగా జిల్లాలో 100 రోజుల వ్యవధిలో 5 వేల గృహాలు, ఏడాదిలోపు 35 వేల గృహాలను పూర్తి చేయాల్సి ఉందన్నారు. డిసెంబర్ 31వ తేదీ నాటికి రూఫ్ లెవెల్ పూర్తయిన భవనాలను నూరు పూర్తి చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులకు రుణాలు ఇప్పించి వాటిని నిర్మాణాల కోసం వినియోగించుకునేలా చూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ ద్వారా గృహ లబ్దిదారునికి 90 రోజుల పనిదినాలు కల్పించి వేతన లబ్ధి చేకూర్చాలన్నారు. హౌసింగ్ పీడీ బి నగేష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పురోగతిని వివరించారు. సమీక్షలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

టెక్నిక్‌పై ఆరు నెలల శిక్షణ

విశాలాంధ్ర-రణస్థలం : మండలం, వరిసాం పంచాయతీ అరోబిందో ఫార్మా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం ఎమ్మెస్సీ చదివిన విద్యార్థులకు "ఫార్మాసిటీకాల్ క్వాలిటీ కంట్రోల్ అనలైటికల్ టెక్నిక్స్" పై ఆరు నెలల శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ కాలం ముగిసిన సందర్భంగా 11వ బ్యాచ్ 25 మంది విద్యార్థిని అండ్ విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రధానోత్సం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా డా.యుఎన్‌బీ రాజు - సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కార్పొరేట్ హెచ్ఆర్ డిపార్ట్మెంట్ మరియు డా. రమా శ్రీనివాస్ అసోసియేట్ ప్రెసిడెంట్ క్వాలిటీ డిపార్ట్మెంట్ చేతులు మీదుగా సర్టిఫికెట్స్ ప్రధానోత్సం చేయబడినది. ఈ ఆరు నెలల శిక్షణలో అనుభవజ్ఞులు అయినా అధ్యాపకులచే, అధునాతన యంత్రలతో ఫార్మా అండ్ కెమికల్స్ కు అవసరమైన శిక్షణ ఇవ్వడమైనది మరియు ఈ ఆరు నెలల శిక్షణ కార్యక్రమం వలన వివిధ ఫార్మా రంగంలో ఉద్యోగ అవకాశాలు పొందడానికి అవకాశం కలదు అని కమలాకర్ రెడ్డి - సీనియర్ జనరల్ మేనేజర్ హెచ్ఆర్ అండ్ అడ్మిన్ డిపార్ట్మెంట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అపిటోరియా ఫార్మా మరియు అరోబిందో ఫార్మా ఫౌండేషన్ టీమ్ పాల్గొన్నారు.

బొంతు ఎత్తిపోతల పథకంపై రైతుల్లో పెరిగిన ఆసక్తి

విశాలాంధ్ర-జలుమూరు : సారవకోట మండలం బొంతు ఎత్తిపోతల పథకం త్వరలో నిర్మాణం పూర్తవుతుందని రైతులు ఆశాభావం వ్యక్తపరిచారు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని ఎత్తిపోతల పథకంపై ఈ ప్రాంత రైతులు పడుతున్న బాధలను స్థానిక శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి సూచించి సమస్య పరిష్కరించాలని కోరడంతో ఈ ప్రాంత రైతులు ఆనంద వ్యక్తపరిచారు. ప్రతి ఏటా సాగు నీరు కోసం తంతాలు పడుతున్న ఈ ప్రాంత రైతాంగ కష్టాలను దృష్టిలో ఉంచుకొని శాసనసభ్యులు బొగ్గు రమణమర్తి 2018లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లగా పథకం మంజూరు చేసి 150 కోట్లు మంజూరు చేసిన ఘనత దక్కిందని మంజూరైన కొంతకాలం 65శాతం పనులు పూర్తయిన తర్వాత ప్రభుత్వం మారడం పథకం మూలపాలన జరిగిందని రైతులు ఆందోళన చెందారు. ప్రస్తుత శాసనసభ్యులు ఈ పథకాన్ని పూర్తి చేయాలని దీక్షతో ముఖ్యమంత్రితో చర్చించడం ఎంతో ఆనందదాయకంగా ఉందని సారవకోట మండల రైతాంగం సంతోషం వ్యక్తపరిచారు ఖరీఫ్ సీజన్ అనంతరం పనులు జరిగే మార్గాలు కనిపిస్తున్నాయని రైతులు స్పష్టం చేశారు.

రగ్బీ జిల్లా స్థాయి జట్టు ఎంపిక

విశాలాంధ్ర-టెక్కలి: మండలంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అండర్ 12 బాలురు మరియు బాలికలు ఛాంపియన్షిప్ జిల్లాస్థాయి రగ్బీ ఎంపికలు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు డొంకన రామకృష్ణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గోవిందమ్మ ప్రారంభించారు. మొత్తం టీం 24 మందికి (బాలురు 12 మంది ంబాలికలు 12) మందిఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ ఎంపికైన క్రీడాకారులు ఉద్దేశించి డొంకన రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి మన శ్రీకాకుళం జిల్లా కి మంచి పేరు తీసుకురావాలని దీవించారు. రాష్ట్రస్థాయిలో ఒకటి, రెండు తేదీల్లో జరగబోయే రాష్ట్ర స్థాయి నెల్లూరు జిల్లా కావలి లో ఈ జిల్లా జట్టు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ ఎంపికైన క్రీడాకారుల నెల్లూరు వెళ్లడానికి ప్రయాణ ఖర్చులు జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షులు చూసుకున్నట్లు తెలిపారు. ఈ ఎంపికలలో శ్రీకాకుళం జిల్లా రగ్బీ ప్రధాన కార్యదర్శి పొన్నాడ పార్వతీశం, ఆర్గనైజేషన్ సెక్రటరీ బాడాన నారాయణరావు, కే.కే.రామిరెడ్, కాపుల రఘునాథరావు, డిగ్రీ కాలేజ్ పీడీసత్యనారాయణ, పి.జగదీష్, అప్పనమ్మ, ప్రమీల, భారతి, దుర్గ,సీతయ్య, మొదలగు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ పై గ్రామస్తులకు అవగాహన : సీఐ

విశాలాంధ్ర-టెక్కలి: పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా మండలంలో స్థానిక సీతాపురంలో గురువారం గ్రామస్తులకు రహదారి భద్రతపై, మహిళల రక్షణపై, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలుపై, అవగాహన కార్యక్రమాన్ని సీఐ అంబటి విజయ్ కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో రహదారి భద్రతలు పాటించక పోవడంతో ఈ మధ్యకాలంలో రహదారి ప్రమాదాలతో అనేకమంది మృతి చెందుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతలు పాటించాలని, వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్ కు వాహనాలు ఇవ్వరాదని తెలిపారు. అలాగే చైన్స్ స్నాచింగ్, సైబర్ మాసాలు ఈమధ్య ఎక్కువగా జరుగుతున్నాయని, ఈ సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మత్తు పదార్థాలు సేవించడం ఆరోగ్యానికి హానికరమని,ఈ మధ్య కాలంలో ఎక్కువమంది మాదకద్రవ్యాలను ఉపయోగించి అనారోగ్యపాలై మృతి చెందుతున్నారని అన్నారు. కొంతమంది దాన్ని వ్యసనంగా, కొంతమంది ఆనందం కోసమని, లేదా క్షణిక ఆనందం కోసమని లేదా రకరకాల పరిస్థితులను తట్టుకోలేక ఇటువంటి వ్యసనాలకు లోబడుతున్నారని, మాదక ద్రవ్యాల పై ప్రతి ఒక్కరూ దూరం ఉండాలని తెలిపారు. అదేవిధంగా ఎవరైనా ఇటువంటి మాదకద్రవ్యాలను అక్రమంగా రవాణా చేయడం కూడా చట్టరీత్యా నేరమని సీఐ విజయ్ కుమార్ తెలిపారు. ఇలా మరికొన్ని వాటిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

తత్వ శాస్త్ర అధ్యయనంతోనే అన్ని శాస్త్రాలపై అవగాహన

- వీ సీ ప్రొఫెసర్ కే ఆర్ రజనీ

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: తత్వ శాస్త్ర అధ్యయనంతోనే అన్ని శాస్త్రాలపై అవగాహన ఏర్పడుతుందని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో గురువారం నిర్వహించిన ప్రపంచ తత్వ శాస్త్ర దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మానవ విలువలు. సామాజిక నైతికత దిగజారుతున్నప్పుడు తత్వశాస్త్రం అవసరమన్నారు. సోక్రటీస్, ప్లేటో, అరిస్టాటిల్ వంటి తాత్విక మేధావులు భవిష్యత్ ప్రపంచానికి అవసరమైన ఆచరణ సిద్ధాంతాలు, సామాజిక విద్య సంబంధిత విలువలు శతాబ్దాల క్రితమే తెలియజేశారన్నారు. విలువలు, తార్కిక విజ్ఞానం, నైతికత, ధర్మాలు తదితర అంశాలను పాఠశాల స్థాయిలోనే బోధించనట్టయితే సత్ప్రవర్తన అలవడుతుందన్నారు. వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, ప్రత్యేకాధికారి డాక్టర్ కె. సామ్రాజ్యలక్ష్మి, వర్సిటీ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్, డాక్టర్ ఎం. అనూరాధ, డాక్టర్ సీహెచ్. రాజశేఖరరావు, ఓఎస్డీ డాక్టర్ యు.కావ్యజ్యోత్స్న, అధ్యాపకులు డాక్టర్ పి.రవికుమార్, డాక్టర్ కె.ఉదయకిరణ్ అన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం బొరివంక సబ్‌స్టేషన్ పరిధిలో మాణిక్యపురం ఫీడర్లో చెట్లు తొలగింపు, వైర్లు మరామత్తులు నిమిత్తం బి.జి. పుట్టుగ,వరక, కుసుంపురం, బల్లిపుట్టుగ, మాణిక్యపురం పంచాయతీ గ్రామాల్లో ఉదయం 9 గంటల నుండి సాయింత్రం 3 గంటల వరకు గృహ, వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగునని పలాస విద్యుత్తుశాఖ ఈఈ జి. యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలు సహకరించాలని కోరారు.

పాఠశాలల పని వేళ పెంపుదలను నిలుపుదల చేయాలి

విశాలాంధ్ర - ఆమదాలవలస: రాష్ట్ర విద్యా శాఖ ఉన్నత పాఠశాలల పని వేళలను పెంచుతూ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే నిలుపుదల చేయాలని డీటీఎఫ్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పూజారి హరిప్రసన్న, పేడాడ కృష్ణారావు డిమాండ్ చేశారు. ఇలా పని వేళలు పెంచడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులపై మానసిక ఒత్తిడి పెరుగుతుందన్నారు. ఇప్పుడున్న పని వేళలు కొనసాగిస్తూనే, పదవ తరగతి విద్యార్థులకు మార్చి పబ్లిక్ పరీక్షలు ప్రిపేర్ కోసం ప్రతీ రోజు సాయంత్రం 4-5 గంటల వరకు రోజుకు ఒక సబ్జెక్టు స్టడీ అవర్‌ను పెట్టడం మంచిదని అభిప్రాయపడ్డారు. సంబంధిత విద్యా శాఖ ఉన్నతాధికారులు, ప్రభుత్వం మరోసారి పున: పరిశీలన చేయాలని కోరారు.

ఎచ్చెర్లలో ఐటిహబ్ ఏర్పాటు చేయండి

అసెంబ్లీలో ఎమ్మెల్యే ఎన్ఈఆర్

విశాలాంధ్ర - రణస్థలం: ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు ఐటీ హబ్ కావాలని అసెంబ్లీలో ప్రస్తావించడంపై ఐటీ మంత్రి నారా లోకేష్ అభినందించారు. విశాఖపట్నం నగరానికి సమీపంలో గల ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఐటి హబ్ ఏర్పాటు చేయాలని అక్కడి ఎమ్మెల్యే ఎన్ ఈశ్వరరావు అసెంబ్లీలో ప్రస్తావించారు. భోగాపురం ఎయిర్ పోర్టుకు 25 కిలోమీటర్లు దూరంలో ఎచ్చెర్ల సెగ్మెంటు ఉంది. అంబేద్కర్ యూనివర్సిటీ ,ట్రిబుల్ ఐటి విద్యాసంస్థలున్నందున ఐటి హబ్ ఏర్పాటు చేయాలని ఎన్ ఈ ఆర్ అసెంబ్లీకోరడంపట్ల లోకేష్ సానుకూలంగా స్వాగతించారు. తన దృష్టిలో ఉందని గతంలో గుంటూరులో నిర్వహిస్తున్న ఐటి హబ్ ను చూసేందుకు వెళ్లే ప్రయత్నం చేశానన్నారు. ఎమ్మెల్యే ఈశ్వరరావు ప్రస్తావిచ్చిన అంశాన్ని పరిగణలోకి తీసుకుంటామని లోకేష్ తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తం చెందారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర -మందస: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పలాస రూరల్ సర్కిల్ సి.ఐ తిరుపతిరావు అన్నారు. గురువారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో హరిపురం బస్టాండ్ మూడురోడ్లు కూడలి వద్ద విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరదాగా అనుకొని అలవాటు చేసుకొని మత్తుకు బానిసై యువత తమ జీవితాలను నాశనం చేసుకోకూడదన్నారు. గుట్కా, సిగరెట్, పాన్‌మసాలా, గంజాయి వంటివాటి జోలికి పోవద్దని అన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లలపాలెం గ్రామంలో టీడీపీ సభ్యత్వం

విశాలాంధ్ర -మందస: లోహరిబంద పంచాయితీ గొల్లలపాలెం గ్రామంలో గురువారం టీడీపీ సభ్యత్వం నమోదు ముమ్మరంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి దాసరి తాతారావు, నర్తు దివాకర్, నర్తు అప్పారావు, దాసరి సుధాకర్, నర్తు వైకుంఠరావు, పెద్దిని తిరుపతి, నర్తు ఈశ్వరరావు, ఎం.అజయ్, నర్తు మహాలక్ష్మి, పిట్ట హిమావతి, నర్తు నాగవేణి, మామిడి తేజమ్మలు పాల్గొన్నారు.

వెలుగు కార్యాలయంలో అవకతవకలు...

అక్రమాలకు తెర లేపిన ఉద్యోగులు..?

ఎం.ఎం.ఎస్.వి.ఓ.ఎన్నికలు లేకుండా కాలయాపన....!

విశాలాంధ్ర - మందస: మందస మండల వైఎస్ఆర్ క్రాంతి పదం (వెలుగు) కార్యాలయంలో విచిత్రమైన పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ కార్యాలయంలో జరుగుతున్న అవకతవకల విదానాలకు ఉద్యోగులే కీలక భూమిక పోషిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎం.ఎం.ఎస్.లో నిధులు స్వాహా జరిగాయన్న ప్రచారం జరుగుతుంది. ఇటీవల ఇక్కడ పనిచేసిన ఏ.పి.ఎం. జి. ప్రసాద్ వజ్రపుకొత్తూరు మండలంకు బదిలీ అయిన సంగతి తెలిసినదే. ఈయన పనిచేసిన కాలంలో కార్యాలయంలో జరిగిన ఆర్థిక లావాదేవీలలో ఆయనకు సంబంధం ఉందన్న కారణంతో ఈయనకు కార్యాలయం నుంచి ఎటువంటి బకాయిలు లేవని (నో డ్యూస్) సర్టిఫికెట్ ఇచ్చేందుకు కార్యాలయం నిరాకరించడంతో ఉద్యోగులలో ఈ అంశం చర్చకు దారితీసింది. ఇదిలా వుంటే ఇటీవల కార్యాలయం మరమ్మతులు పేరిట భారీగా నిధులు డ్రా జరిగినట్లు ప్రచారం జరుగుతుంది. మరమ్మతులకు ఎక్కువగా నిధులు ఖర్చులు జరగనప్పటికి బారీగా ఖర్చులు జరిగినట్లు లెక్కలు చూపుతున్నారు. జరిగిన విషయంను కొత్తగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఏ.పి.ఎం. కూర్మారావుకు తెలిసినా ఆయన మౌనం దాల్చి పూర్వపు ఏ.పి.ఎం కు ఈ అంశం పై క్లియరెన్స్ ఇచ్చేందుకు సుముఖుత చూపడం లేదు. ఇదిలా ఉంటే ఈ కార్యాలయంలో వివిధ కార్యక్రమాల కొరకు చేపడుతున్న ఖర్చులు ప్రభుత్వ నిబంధనలకు భిన్నంగా చేసినట్లు చూపిస్తూ నిధులను స్వాహా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మహిళా సంఘాలకు సంబందించిన ఋణం మంజూరులో క్రింది స్థాయి సిబ్బంది పెద్ద ఎత్తున చేతివాటం ప్రదర్శిస్తున్నారని, అందులో వెలుగు కార్యాలయ ఉద్యోగుల సూచనలతోనే అక్రమంగా వసూళ్లు జరుగుతున్నాయన్న విమర్శలు వున్నాయి. ఇదిలా ఉంటే మండల స్థాయిలో మహిళా సమైక్య కు ప్రతీ ఏటా పాలకవర్గం ఎన్నికలు జరగాలి. అంతకు ముందు గ్రామఖ్య సంఘాలు ఎన్నికలు నిర్వహించాలి.గ్రామఖ్య సంఘాలలో ఎన్నికైన సభ్యులు మండల స్థాయిలో జరిగే మండల మహిళా సమైక్య కు పాలకవర్గం ఎన్నికకు సభ్యులు గా ఉంటారు. మండలం లో 56 మంది వి.ఓ లు ఉన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అనేక చోట్ల గ్రామఖ్య సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా సంబంధిత సీఎఫ్, సిసిలు కలిసి వీరికి అనుకూలమైన వారి పేర్లతో తీర్మానాలు తయారు చేసి మండల సమైక్య కు సమర్పించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా కోరం కాకుండా గ్రామఖ్య సంఘాల ఎన్నికలు జరిగినట్లు సీఎఫ్, సిసి లు కలిసి తీర్మానాలు తయారు చేసినట్లు కూడా ఆరోపణలు వున్నాయి. గ్రామఖ్య సంఘాలు నుంచి మండల మహిళా సమైక్య పాలకవర్గం వరకు తమ కనుసన్నలలో ఉండేలా ప్రణాళిక బద్ధంగా ఉద్యోగులు కలిసి పన్నాగం పన్నారని ఆరోపణలు వున్నాయి. దీనిపై అధికారులు దృష్టి సారించి సమగ్ర దర్యాప్తు చేయాలని పలువురు మహిళలు కోరుతున్నారు.

సామాజిక బాధ్యత దిశగా యూబీఐ ముందడుగు

- యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ప్రశంసలు
- రూ.70 లక్షలు ఖర్చుతో అభివృద్ధి పనులు

విశాలాంధ్ర - శ్రీకాకుళం: దేశంలోని ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఒకటైన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాభాల కంటే ఎక్కువగా సమాజ సేవకు ప్రాధాన్యతనిస్తోంది. బ్యాంకు తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) కింద వివిధ రంగాలలో అనేక కార్యక్రమాలను చేపడుతోంది. శ్రీకాకుళం జిల్లాలో ఈ ఏడాది చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఆ సంస్థకు ప్రశంసలు లభిస్తున్నాయి. స్వయంగా జిల్లా కలెక్టర్ సైతం స్వయంగా వారిని పిలిచి ప్రత్యేకంగా అభినందించారు. సిఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా సమాజ సేవకు కట్టుబడి ఉన్న యుబిఐ శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి గణనీయమైన కృషి చేస్తోంది. ముఖ్యంగా విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు, లైబ్రరీలు నిర్మించడం, గ్రామాలకు విద్యుత్ సరఫరా చేయడం, ఆసుపత్రులకు అవసరమైన పరికరాలు అందించడం, పాఠశాలలలో టాయిలెట్లు నిర్మించడం వంటి పలు కార్యక్రమాలు చేపట్టింది.

ఈ ఏడాది యూనియన్ బ్యాంక్ చేపట్టిన సామాజిక బాధ్యత కార్యక్రమాలు..

విద్యార్థుల కోసం అత్యాధునిక లైబ్రరీ:లి టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో రూ.33 లక్షల వ్యయంతో అత్యాధునిక లైబ్రరీ భవన నిర్మాణం పూర్తి చేసింది. 600 మంది విద్యార్థులు ఏక కాలంలో చదువుకునేలా ఇక్కడ ఏర్పాట్లు ఉన్నాయి. త్వరలో మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదగా ప్రారంభించడానికి ముస్తాబు జరుగుతోంది.

గ్రామీణ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా: తరచూ విద్యుత్ అంతరాయాన్ని ఎదుర్కొంటున్న సచివాలయాలకు నెడ్ క్యాప్‌తో కలిసి ఒక్కొక్కటి రూ.1.6 లక్షలు చొప్పున వ్యయం చేసి మొత్తం 10 గ్రామ వార్డు సచివాలయాలకు రూ.16 లక్షలతో సోలార్ ప్యానెల్‌లు ఏర్పాటు చేసింది. ఆరోగ్య సేవలకు మద్దతు:లి జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి బ్లడ్ ప్యాకెట్స్ నిల్వ చేసేందుకు రెండు ఫ్రీజర్లను రూ.10.50 లక్షల వ్యయంతో వితరణ చేసింది. విద్యార్థులకు మంచినీటి సౌకర్యం:లి టెక్కలి, ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో విద్యార్థినిలకు మంచినీటి సదుపాయం కోసం రూ.2.50 లక్షల వ్యయంతో ఆర్ ఓ వాటర్ ప్లాంట్ ను నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చింది. స్కూళ్లలో శుభ్రమైన పరిసరాలు: గర్ల్స్ కాలేజ్ తామరపల్లి, వంజంగి గర్ల్స్ స్కూల్, లోలుగు నవోదయ వంటి పాఠశాలల్లో ఒక్కో పాఠశాలకు రూ. రెండు లక్షల చొప్పున, రూ.6 లక్షల వ్యయంతో అన్ని సౌకర్యాలతో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేసింది.

వృద్ధులు, వికలాంగులకు సౌకర్యాలు: శ్రీకాకుళం నగరంలోని నాగావళి నది ఒడ్డున ఉన్న శ్రీ దత్తాత్రేయ స్వామి గుడిలో వృద్ధులు, వికలాంగుల కోసం పూజలు, భోజనాలు చేసేందుకు వీలుగా స్టీల్ టేబుల్స్, కుర్చీలు ఏర్పాటు ఏర్పాటు చేసింది. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, జిల్లా యంత్రాంగం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చేస్తున్న ఈ కృషిని ప్రత్యేకంగా అభినందించాయి. ఈ కార్యక్రమాలు జిల్లా అభివృద్ధికి గణనీయంగా దోహదపడుతున్నాయని బ్యాంక్ అధికారులైన రీజనల్ హెడ్ ఎం. వెంకట తిలక్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్, ఎం. సూర్య కిరణ్, తదితర సిబ్బందిని గురువారం తన కార్యాలయంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రత్యేకంగా అభినందించారు.

- మరిన్ని సామాజిక బాధ్యత కార్యక్రమాలు చేపడతాం...ఎం సూర్య కిరణ్, లీడ్ బ్యాంకు మేనేజర్

ఇప్పటికే జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన తమ బ్యాంక్, ముందు ముందు కార్యకలాపాలను మరింత విస్తరించాలని భావిస్తోంది. స్థానికంగా ప్రారంభమయ్యే స్టార్టప్లకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా ఉద్యోగ అవకాశాలను సృష్టించాలని భావిస్తున్నాము. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలకు వ్యాపార శిక్షణ ఇవ్వడం, స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడం ద్వారా మహిళా సాధికారతను ప్రోత్సహించాలని నిర్ణయించాము.

- పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం:

ఎం. వెంకట తిలక్, రీజినల్ హెడ్. నదుల పరిరక్షణ, చెట్లు నాటడం, ప్లాస్టిక్ నిషేధించడం వంటి పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను చేపట్టాలని ప్రణాళిక చేస్తున్నాము. అలాగే విద్యార్థులకు ఉపకారవేతనాలు అందించడం ద్వారా వారి విద్యను ప్రోత్సహించాలని నిర్ణయించాము.

బాదంగీర్ సాయి కన్నుమూత



విశాలాంధ్ర - విశాఖ సిటీ: ప్రముఖ నాటక రచయిత, రంగసాయి నాటక సంఘం, రంగసాయి నాటక గ్రంథాలయం వ్యవస్థాపకులు ఎ.వి.వి.ఎస్.మూర్తి (బాదంగీర్ సాయి) గురువారం సాయంత్రం ఆరు గంటల సమయంలో తుది శ్వాస విడిచారు. విశాఖలో నివాసముండే ఆయన కొంతకాలంగా బ్రెయిన్ హ్యామెరెజ్ సమస్యలతో బాధపడుతున్నారు. గురువారం సాయంత్రం ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మురళీనగర్లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. నాటక కళాకారుడైన బాదంగీర్ సాయి నటనతో సరిపెట్టుకోకుండా నాటక వికాసానికి కూడా తన వంతు కృషి చేసేందుకు నిరంతరం తపిస్తూ నాటక ప్రదర్శనలకు శ్రీకారం చుట్టారు. దేశ, విదేశాల్లో ప్రసిద్ధి గాంచిన సురభి నాటకాలను విశాఖలో 40 రోజులపాటు ప్రదర్శింపజేశారు. అదే విధంగా విశిష్ట ప్రేక్షకాదరణ పొందిన అనేక నాటకాలను విశాఖ నగరంలో ప్రదర్శింపజేస్తూ 2010లో ఏర్పాటు చేసిన రంగసాయి నాటక సంఘం సంస్థ ద్వారా కృషి చేశారు. తెలుగు నాటక రంగ దినోత్సవం, ప్రపంచ నాటక రంగ దినోత్సవాల సందర్భంగా ఏటా మరుగుపడిన కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేయడంతో పాటు, వారిని ఘనంగా సత్కరిస్తుంటారు.

నాటకం అనేక సామాజిక వాస్తవాల విభిన్న దర్పణం. నేటికీ అధునాతన కళలకు చోదక శక్తిని అందించే రంగమని, అలాంటి నాటక సృజనను రానున్న తరాలకు అందివ్వాలని నాటక పుస్తకాల సేకరణ ప్రారంభించి, పది వేల కు పైగా నాటక గ్రంథాలతో 'రంగసాయి నాటక గ్రంథాలయం' ఏర్పాటు చేశారు. తాను ప్రేమించే నాటక రచనలను నిక్షిప్తం చేసేందుకు ఏడు సంవత్సరాలు నాటక గ్రంథాలను నటులు, నాటక రచయితలు, సంస్థలను అర్థిస్తూ విలువైన సమాచారాన్ని సేకరించారు. అంతే కాదు, సేకరించిన ఆ నాటక గ్రంథాలను పదిలపరిచేందుకు దేశంలోనే ఏకైక నాటక గ్రంథాలయంగా మహా విశాఖ నగర పాలక సంస్థ శాశ్వత ప్రాతిపదికన రంగసాయి నాటక గ్రంథాలయం రూపుదిద్దింది. ఆయన మృతి చెందారని తెలుసుకున్న కళాకారులు, రచయితలు, ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

డిసెంబర్ 02 నుంచి 30 వరకు

మార్గశిర మాసోత్సవాలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: డిసెంబర్ 02 నుంచి 30వ తేదీ వరకు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం పరిధిలో జరగనున్న మార్గశిర మాసోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో పలు అంశాలపై ఆయన మార్గదర్శకాలు జారీ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ప్రణాళికతో చర్యలు చేపట్టాలని, ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, వాహనాలకు పార్కింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు. చైన్ స్నాచింగ్ లు, ఇతర దొంగతనాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ప్రతి గురువారం ఏవీఎన్ కళాశాల దిగువ నుంచి వాహనాలు దారి మళ్లించుట, శుక్ర, శనివారాల్లో టౌన్ కొత్త రోడ్డు నుంచి మెయిన్ రోడ్డు వరకు ట్రాఫిక్ మళ్లించాలని పోలీసు శాఖ అధికారులకు సూచించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా సరిపడా క్యూలైన్లు, మంచినీటి సదుపాయం, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, ఎక్కడికక్కడ డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పోలీసు శాఖ సూచనల మేరకు అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు అమర్చాలని ఆలయ అధికారులను ఆదేశించారు. నిత్యన్నదానం, ప్రసాదం కౌంటర్, క్యూలైన్ల వద్ద సరిపడా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఎక్కడికక్కడ సూచిక బోర్డులు, వికలాంగులకు వీల్ ఛైర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. అన్ని విభాగాల అధికారులతో ఆలయ సమీపంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డుకు ఆనుకొని ఉన్న దుకాణాలను వెనక్కి జరపాలని, ట్రాఫిక్ అంతరాయం, భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సేవా సంఘాలు, ఎన్.ఎస్.ఎస్., ఎన్.సి.సి. వాలంటీర్లను వినియోగించుకోవాలని చెప్పారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప కమిషనర్, ఆలయ ఈవో కె. శోభారాణి, సహాయక ఈవో టి. అన్నపూర్ణ, కార్యనిర్వాహక అధికారి సి. హెచ్.వి. రమణ, సహాయక ఈవో తిరుమలేశ్వరరావు, అధికారులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.